క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు



దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ,అర్చకులు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం వారు గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను నిర్వహించారు. దేవస్థానం ఈఓ , అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాధి, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

ఈ-క్రాప్ నమోదుపై పరిశీలన

ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలోని కరివేన నల్లకాల్వ, బాపనంతపురం గ్రామాల్లో బుధవారం ఈ- పంట నమోదుపై ఏఓ విష్ణువర్ధన్ రెడ్డి తనిఖీ నిర్వహించారు. ఈ పంట నమోదు ఆధారంగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని చెప్పారు. పంట నమోదు ద్వారా రైతులకు కనీస మద్దతు ధర, పంట రుణాలు తదితర పథకాలు వర్తిస్తాయని చెప్పారు.

వెంకటాపురంలో అన్నదాన శిబిరం

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం గ్రామంలోని శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 18వ తేదీ వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు చెప్పారు. గురువారం వారు మాట్లాడుతూ వెంకటాపురం గ్రామంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా కాలినడకన శ్రీశైలం వెళ్లే శివస్వాములు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రోజు శివభక్తులకు మధ్యాహ్నం భిక్ష, రాత్రి అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

చేతి వృత్తులతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న నాబార్డ్ ఏపీఎం పార్థవ

ఆత్మకూరు: చేతి వృత్తుల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చనని నాబార్డ్ అడిషనల్ జిల్లా మేనేజర్ పార్థవ అన్నారు. పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యాలయంలో గురువారం మహిళలకు కుట్టుమిషన్లపై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళల జీవనప్రమాణం మెరుగుపడాలంటే చేతివృత్తులపై దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా కుట్టుమిషన్లు, అల్లికలు, పేపర్‌ప్లేట్లు తదితర పనుల్లో శిక్షణ పొంది వాటి ద్వారా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, లిటిల్‌ఫ్లవర్ సంస్థ నిర్వాహకులు విజయభారతి, సునిత తదితరులు మాట్లాడారు.

కొలతల ప్రకారం పని చేస్తే గరిష్ట వేతనం

జూపాడుబంగ్లా: నిర్దిష్ట కొలతల ప్రకారంగా పనులు చేసి గరిష్టస్థాయి వేతనం పొందాలని ఎంపీడీఓ మంజులవాణి, ఏపీఓ గౌరీబాయి అన్నారు. గురువారం మండలంలోని మండ్లెం, తాటిపాడు గ్రామాల్లోని ఉపాధిహామీ పనుల ను తనిఖీ చేశారు.వారు ఉపాధికూలీలతో మా ట్లాడుతూ ప్రభుత్వం రోజుకు రూ.257ల కూలి ఇస్తున్నట్లు తెలిపారు. ఆమేర వేతనం పొందాలంటే టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు సూచించే కొలత ల ప్రకారంగా కనీసం రోజుకు 4గంటల పాటు పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంటు లింగన్న, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

త్వరగా ఇళ్లు నిర్మించుకోండి

జగనన్నకాలనీల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా గృహాలు నిర్మించుకోవాలని ఎంపీడీఓ మంజులవాణి సూచించారు. గురువారం ఆమె మండలంలోని మండ్లెం గ్రామంలోని జగనన్నకాలనీని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం త్వరగా బిల్లులు మంజూరు చేస్తున్నందున ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలని సూచించారు.

పౌష్టికాహారంతో క్షయవ్యాధి నివారణ

కొత్తపల్లి: పౌష్టికాహారంతోనే క్షయవ్యాధిని నివారించడం సాధ్యమవుతుందని డాక్టర్ దీపానాగవేణి అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో క్షయవ్యాధిగ్రస్తులకు టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. డాక్టర్ దీపానాగవేణి మాట్లాడుతూ క్షయవ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా నంద్యాల పార్లమెంట్ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి సహకారంతో నందికొట్కూరు నియోజకవర్గంలో 20 మంది టీబీ బాధితులకు 6 నెలల పాటు రూ.10 వేలు విలువచేసే పౌష్టికాహార కిట్లను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బాలకృష్ణ, పీహెచ్ఎన్ అయేషా బేగం, హెల్త్ సూపర్‌వైజర్ యశోద, హెల్త్ అసిస్టెంట్లు చెన్నమ్మ, సరిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం
- రూ.7 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం
- ట్యాంకులను, నీటి సరఫరాను ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి





పబ్లిక్ కుళాయి వద్ద నీటిని పట్టి బిందెను మహిళకు అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా, పూజచేసి వాటర్‌ట్యాంక్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలోని సమస్యల పరిష్కారానికి తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తీవ్రంగా కృషి చేశానని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలోని ప్రభుత్వ ఆసుపత్రి, మటన్ మార్కెట్, బండ్లబజార్, కాకుల్‌సెంటర్, పాదుపు భవనం, ఫిల్టర్‌హౌస్ ప్రాంతాల్లో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌లను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. జలాశయం నుంచి ఫిల్టర్‌హౌస్‌కు చేరుకున్న నీటిని 30 హెచ్‌పీ మోటార్ల ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు నీటిని పంపింగ్ చేసి తద్వార కాలనీ ప్రజలకు రోజూ నీటిని అందించేందుకు శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లుగా శ్రీశైలం ప్రాజెక్ట్ గ్రామ వాసుల కోరిక నెరవేరిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్ల సమస్యకు పరిష్కారం

శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా తాగునీటి సమస్య ఉంది. వారం రోజులకు ఒక సారి లేదా పది రోజులకు ఒక సారి మంచినీరు సరఫరా అవుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. గతంలో రూ.5.10 లక్షలను తాగునీటి పైప్‌లైన్ల కోసం, మోటార్ల కోసం ఖర్చు చేశారు. అయినప్పటికీ గ్రామప్రజలకు తాగునీరు అందకపోవడంతో మరో రూ.7కోట్లతో 20 కిమీ మేరా పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయించడంతో పాటు 6 ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను నిర్మించారు. కాగా మరో 7.46 కోట్ల రూపాయలతో త్వరలోనే సున్నిపెంట గ్రామప్రజలకు ఇంటింటికీ కుళాయి , లింగాలగట్టు ప్రజలకు రక్షిత మంచినీటి సరఫరాను చేయనున్నారు.

మూడున్నరేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు

గడిచిన మూడున్నర ఏళ్లలో విద్యుత్ సరఫరాను ఏపీఎస్పీడీసీఎల్‌కు అప్పగించడం, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా తాగునీటి సరఫరాకు మరొక పైప్‌లైన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లోని సీసీ రోడ్లను అభివృద్ధి పరచడం, గ్రామ సచివాలయాల ఏర్పాటు, వలంటీర్ల నియామకాన్ని చేపట్టడం వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. సుదీర్ఘకాలంగా నెలకొని ఉన్న గ్రామపంచాయతీ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పంచాయతీని ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. కొద్ది నెలల్లోనే జల వనరుల శాఖ నుంచి గ్రామ పంచాయతీకి భూముల బదలాయింపు చేయబోతున్నామని, వెనువెంటనే గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, వార్డు మెంబర్ల ఎన్నికలను కూడా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎంఏ రజాక్, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి జింకా గుండయ్య యాదవ్, మండల నాయకులు భరత్‌రెడ్డి, ఆసాది ప్రవీణ్ దివ్యతేజ, టీఎండీ రఫి, రబ్బాని, మర్చంట్ అసోసియేషన్ కార్యదర్శి చిన్న శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మనోహర్, శ్రీనివాసులు, పకీరయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైలం ప్రాజెక్టలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ఠ



యాగం నిర్వహిస్తున్న పురోహితులు

బండిఆత్మకూరు: పార్నపల్లె గ్రామంలో ఇటీవల సీతారామ, ఆంజనేయ, వేణుగోపాల స్వామి ఆలయాలను నిర్మించారు.ఈ ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం పూజారులు శాస్త్రోత్సకంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ షబ్బీర్, ఆలయ చైర్మన్ జనార్దనరెడ్డి, ఉప సర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

బండిఆత్మకూరు : మండల కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి రెవెన్యూ ఉద్యోగులు అండగా నిలిచారు. తహసీల్దారు ఉమారాణి, డిప్యూటీ తహసీల్దార్ హరిత ఆధ్వర్యంలో బాధితుడు ఆంజనేయులు కు టుంబానికి రూ. 7 వేల నగదును అందజేశారు. ఇటీవల గ్రామానికి చెందిన ఆంజనేయులు నివా సం ఉన్న ఇళ్లు షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమయ్యింది. దీంతో రెవెన్యూ ఉద్యోగులు విరాళం ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుప్రియ, సౌజన్య, వీఆర్వోలు ఏసుపాదం, తిరుపాలు, వేణుగోపాల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం' వాయిదా

జూపాడుబంగ్లా: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ గురువారం మధ్యాహ్నం నుంచి అమల్లోకి రావటంతో పట్టణంలోని గాంధీనగర్‌లో మూడో రోజు నిర్వహించాల్సిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ వాయిదా వేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వ కార్యక్రమాలేవీ నిర్వహించరాదనే నిబంధనలున్నాయి. ఈనెల 16న ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లు స్వీకరించనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు జిల్లా అధికారులు మండలాల తహసీల్దార్లకు సమాచారం అందించారు.

ధ్రువపత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లండి

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో అనుమానస్పదంగా లభించిన వాహనాలకు సంబంధించిన ఆర్సీ, వాహనాల ధ్రువీకరణ పత్రాలు సమర్పించి తీసుకెళ్లవచ్చునని నందికొట్కూరు పట్టణ సీఐ విజయభాస్కర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో, ఈ మధ్య కాలంలో అనుమానస్పదంగా లభించిన 29 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలు, రెండు కార్లు తమ ఆధీనంలో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటిదాకా వాటికి సంబంధించిన వారెవ్వరూ పోలీసులను ఆశ్రయించకపోవటంతో వాటిపై పలుకేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.వాహనాల సమాచారం కోసం నందికొట్కూరు పట్టణపోలీసుస్టేషన్‌లో సంప్రదించవచ్చునన్నారు.

బైకుల వేలం

ఆత్మకూరు: పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌నందు బైకుల వేలం పాటలు నిర్వహించినట్లు ఆత్మకూరు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 30 వాహనాలను వేలం వేశామని, వీటి ద్వారా రూ.2,00,046 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

గృహ సారథులూ.. రథసారథులు కండి



గృహసారథులకు కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: గృహసారథులూ. ప్రభుత్వానికి రథ సారథులు కావాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పిలుపునిచ్చారు. ఇంటింటికి వెళ్లి రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న పథకాలు సక్రమంగా అందుతున్నాయా..లేదా..? అర్హత ఉండి, పథకాలు పొందని వారు ఎవరైనా ఉన్నారా..? అనే అంశాలపై ఆరాతీసి ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు కావాలని సూచించారు. గురువారం సాయంత్రం శ్రీశైలం ప్రాజెక్టు సచివాలయం -2 ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పాల్గొన్నారు. పార్టీ వైఎస్సార్‌సీపీ ఎంపిక చేసిన గృహసారథులు తమకు కేటాయించిన గృహాలకు వెళ్లి అర్హులైనవారికి అందుతున్న పథకాలు సక్రమంగా వస్తున్నాయా.., లేదా..? అర్హత ఉండి కూడాపథకాలు అందని వారు ఎవరైనా ఉన్నారా అని ఆరాతీసి.. ఆ వివరాలను పార్టీ కన్వీనర్లకు, వలంటీర్లకు తెలియజేయాలని సూచించారు. గత ప్రభుత్వం పాలన , ప్రస్తుత ప్రభుత్వ పాలన తీరును ప్రజలకు వివరించాలని కోరారు. అనంతరం వైఎస్సార్‌సీపీ గృహసారథులకు కిట్లను పంపిణీ చేశారు.

గిరిజనులకు ఉచిత భోజన వసతి

బండిఆత్మకూరు: నారాయణాపురం ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో గిరిజనులకు దాతల సహకారంతో ఉచితంగా భోజన వసతి ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి కిరణ్ తెలిపారు. ప్రతి నెలా 9వ తేదీన ప్రధాన మంత్రి మాతృత్వ సంరక్షణ యోజన పథకం కింద గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దీంతో ఆసుపత్రికి వచ్చే వారికి ఉచితంగా భోజన వసతిని దాతలు వసుమతి, శాంతకుమారి, భాగ్యశ్రీ సహకారంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేకాక ఆసుపత్రిలో విధులు నిర్వహించే హెల్త్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, రామసుబ్బమ్మ దంపతులు కూడా గిరిజనులకు పౌష్టికాహారం కోసం 50 కిలోల బియ్యాన్ని పంపిణీ చేశారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

మహానంది: మండలంలోని బసాపురం గ్రామానికి చెందిన అబ్బాస్, జాకీర్ గురువారం పొలంలో మందు పిచికారీ చేసేందుకు వెళ్లారు. అయితే కొందరు బసాపురం రైల్వేవంతెన మార్గంలో రాళ్లను తరలిస్తుండటంతో దారి వెంట రాళ్లు పడివున్నాయి. దీంతో బైక్ అదుపు తప్పి కిందపడి గాయాల పాలయ్యారు.

సమాజసేవలో ముందుండాలి

మహానంది: సమాజసేవలో యువత ముందుండాలని, ఆపదలో, అవసరంలో ఉన్నవారిని ఆదుకోవడం ఎంతో పుణ్యఫలమని గాజులపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆంజనేయపురం గ్రామానికి చెందిన రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న సాయి యువసేన సర్వీసెస్ సంస్థ అధ్యక్షుడు రవితేజ, ప్రతినిధులు హరీష్, బాలవుశేని, హుసేని, తదితరులు నిత్యావసర వస్తువులతో పాటు రూ.2వేల నగదు అందించారు.

మహానంది బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



మంత్రి కొట్టుసత్యనారాయణకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ హరిజవహర్‌లాల్‌లను ఆహ్వానించారు. మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఓ వై.మధు, వేదపండితులు, అర్చకులు గురువారం విజయవాడ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి ఇద్దరికి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్ల ప్రసాదాలు, ఆహ్వానపత్రికలు అందించారు. కార్యక్రమంలో వేదపండితులు రవిశంకర అవధాని, ఉప ప్రధానార్చకులు వనిపెంట జనార్దనశర్మ, ముఖ్య అర్చకులు మణికంఠశర్మ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు ప్రభుత్వ సహకారం

పాములపాడు : ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టుకోవాలని ఎంపీడీఓ సుమిత్రమ్మ అన్నారు. గురువారం మండలంలోని జూటూరు, తుమ్మలూరు గ్రామ పంచాయతీల్లో ఇంటింటికి వెళ్లి గృహ లబ్ధిదారులను నేరుగా కలిశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గృహ నిర్మించుకునేందుకు రూ.1.80లక్షలు ఇస్తుందన్నారు. పొదుపు గ్రూపు ద్వారా మరో రూ.35వేలు రుణం ఇవ్వడం జరుగుతుందని వివరించారు. అలాగే స్టీలు, ఇసుక, సిమెంటు సబ్సిడీ ధరకే అందిస్తూ పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. ప్రతి లబ్ధిదారుడు త్వరితగతిన గృహ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట సర్పంచులు నాయిని సావిత్రమ్మ, వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మండలంలోని తుమ్మలూరు గ్రామంలో అభివృద్ధి పనులను ఎంపీడీఓ సుమిత్రమ్మ గురువారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటితో గ్రామంలో నిర్మిస్తున్న కల్వర్టులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆర్థికంగా, రాజకీయంగా రాణించాలి

జూపాడుబంగ్లా: బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఆర్థిక, రాజకీయంగా రాణించాలని బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు మహేంద్ర, లాజర్, స్వాములు అన్నారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని కాన్షిరాం విగ్రహం వద్ద వారు ఆ పార్టీ చైతన్య సదస్సు పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులాల వారీగా రిజర్వేషన్లు కల్పించి వారికి రాజకీయరంగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈనెల 15, 16 తేదీల్లో నంద్యాల, కర్నూలు ప్రాంతాల్లో జరిగే బహుజన రాజ్యాధికార చైతన్య సదస్సుల్లో బడుగు, బలహీనవర్గాల ప్రజలు పాల్గొని వారి హక్కులు,విధులను తెలుసుకోవాలని సూ చి ంచారు. కార్యక్రమంలో చిన్నరత్నమయ్య, తిరుపా లు,నాగరాజు,స్వామన్న, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

పగిద్యాల: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈఓఆర్డీ పుల్లయ్య అన్నారు. గురువారం మండలంలోని నెహ్రూనగర్‌లో రోడ్డుకు ఇరువైపుల చేపట్టిన కంప పొదల తొలగింపు పనులను పర్యవేక్షించారు. స్వచ్ఛ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, గ్రామంలో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పేందుకు పౌరులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని ఆదర్శంగా నిలువాలని కోరారు. అలాగే ఎప్పటికప్పుడు ట్యాంక్‌లను శుభ్రం చేయించాలని సర్పంచ్ రాజేశ్వరికి సూచించారు. గ్రామంలో చేపట్టిన పనుల పట్ల ఈఓఆర్డీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

ఆర్బీకేల్లో పుష్కలంగా ఎరువులు

మహానంది: రైతు భరోసా కేంద్రాల్లో ద్వారా రైతులకు కావాల్సిన యూరియా ఎరువులను పుష్కలంగా అందిస్తున్నామని వ్యవసాయాధికారి నాగేశ్వర రెడ్డి తెలిపారు. గాజులపల్లె ఎరువుల దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహానంది మండలంలో గత రెండు నెలల వ్యవధిలోనే 719.325 మెట్రిక్ టన్నులు(15,985 బస్తాలు) యూరియా ఆర్బీకేల ద్వారా పంపిణీ చేశామన్నారు. ఆర్బీకేల్లో ఎరువులు లేవని వచ్చిన ఆరోపణలు అవాస్తవమని చెప్పారు. ఎరువుల దుకాణాల్లో అనుమతులున్న ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలని ఆదేశించారు.


ఇంటర్మీడియెట్ విద్య కీలకం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు యుగంధర్‌రెడ్డి

మిడుతూరు: ఇంటర్మీడియెట్ విద్య విద్యార్థులకు ఎంతో కీలకమని, ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత శిఖారాలకు చేరుకోవాలని మిడుతూరు జెడ్పీటీసీ సభ్యులు పర్వత యుగంధర్‌రెడ్డి ఆకాంక్షించారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ విద్యార్థుల వీడ్కోలు, కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడితో పాటు సర్పంచ్ జయలక్ష్మమ్మ, ఉప సర్పంచ్ లోకేశ్వరరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జయశంకర్ నాయక్‌ను కళాశాల అధ్యాపకులు సత్కరించారు. కళాశాలలో ల్యాబ్‌ల ఏర్పాటు, అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరూ చేయించాలని అధ్యాపక బృందం జెడ్పీటీసీని కోరింది. స్పందించిన ఆయన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్, మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జయలక్ష్మమ్మ, ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగిరెడ్డి, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్‌ల మంజూరుకు స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న మోటర్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు, నందికొట్కూరు రెవెన్యూ డివిజన్‌లోని వివిధ మండలాల్లో వాహనదారులకు లైసెన్స్ మంజూరు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు మోటర్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.సత్యనారాయణరెడ్డి తెలిపారు. కర్నూలు ఆర్టీఓ కార్యాలయం నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టారు. గురువారం పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు ప్రాంతంలో చాలా మంది టూ వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్ వాహనాలను లైసెన్స్ లేకుండా నడుపుతున్నారని చెప్పారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వ్యక్తికి రూ.5వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వాహనదారులకు లైసెన్స్ కావాలంటే ఎలాంటి చదువు అవసరం లేదని, ఆధార్‌కార్డు ఉంటే చాలన్నారు. ఆధార్‌కార్డుతో మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే వాహన పరీక్షలు నిర్వహించి లైసెన్స్ మంజూరు చేస్తామని చెప్పారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణరెడ్డిని పలువురు ఆర్టీఓ ఏజెంట్లు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే



ఎమ్మెల్యే శిల్పాకు శేషవస్త్రాలను అందిస్తున్న చైర్మన్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి గురువారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ ఎస్ లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, చైర్మన్, ఈఓ స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు.

విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు



విద్యార్థుల హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ మేరి, ఎంఈఓ శ్రీరాములు

కొత్తపల్లి: ఉపాధ్యాయులు పిల్లల జీవితాలకు మార్గదర్శకులుగా ఉండాలని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దని ఎంపీడీఓ మేరి, ఎంఈఓ శ్రీరాములు హెచ్చరించారు. గురువారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామ సచివాలయ పరిధిలోని పాలెంచెరువుగూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ముందుగా మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నారా లేదా, రుచికరంగా, నాణ్యతగా ఇస్తున్నారా లేదా అని ఆరాతీశారు. అదేవిధంగా గిరిజన విద్యార్థులకు ఏమేరకు కనీస విద్యను అందిస్తున్నారని పరిశీలించారు. హాజరు పట్టీని తనిఖీ చేసి సక్రమంగా నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నోలక్షలు ఖర్చు చేస్తుంటే మధ్యాహ్న భోజన నిర్వహకులు మెనూ ప్రకారం విద్యార్థులకు అందించక పోవడం బాధాకరమన్నారు. ఇలాచేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లాలం రమేష్

వెలుగోడు: విద్యార్థులు ఉద్యోగాలు సాధించాలంటే నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎంపీపీ లాలం రమేష్ సూచించారు. స్థానిక జూనియర్ కళాశాలలో భారత క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం జిల్లా ఆఫీసర్ రాహుల్ గిరి రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు యూత్ లీడర్ షిప్ కమ్యూనిటీ డెవలప్ మెంట్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజుల శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పారిశ్రామిక విప్లవం వల్ల చేతివృత్తులకు విఘాతం కలిగిందని, దానిని అధిగమించానికి యువత కొత్త నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలలో ప్రేరణ రూరల్ డెవలప్‌మెంట్ ప్రెసిడెంట్ నూలు నాగేశ్వర రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట రమణ, కేంద్ర ప్రభుత్వ వలంటర్ సురేష్ కుమార్, రవికిశోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఘనంగా ప్రభుత్వ కళాశాల వార్షికోత్సవం

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ పరిపాలనాధికారి విజయభాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం



రోగుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. గురువారం ఆమె పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ వైద్యశాలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ప్రభుత్వ వైద్యాధికారులు అందుబాటులో ఉండి పరీక్షలు నిర్వహించాలన్నారు. గర్భిణులకు ప్రతి నెలా స్కానింగ్ చేసి ఉచితంగా ముందు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకటేశ్వరగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.